క్లుప్తంగా

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. జానపద, శాస్త్రీయ నృత్యాలతో పాటు సినీగీతాలకు డ్యాన్స్‌వేసి సందర్శకులకు ఎంతగానో ఆకట్టుకున్నారు. సందర్శకులు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమం శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు.

గృహాల కోసం దరఖాస్తు చేసుకోండి

పులివెందుల రూరల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా ఇళ్లు మంజూరు కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ డీఈ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి హౌసింగ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, అకౌంట్ బుక్, ఆదాయ సర్టిఫికెట్, జిరాక్స కాపీలు తీసుకుని హౌసింగ్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైతుకు పాము కాటు

ముద్దనూరు : మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతు చిన్నప్రతాప్‌రెడ్డి ఆదివారం పాముకాటుకు గురయ్యారు. 108 సిబ్బంది సమాచారం మేరకు.. ప్రతాప్‌రెడ్డి తన గ్రామంలోని పొలంలో పనిచేసుకుంటుండగా పాముకాటుకు వేసింది. 108 వాహనంలో అతడిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆర్థిక సాయం

పులివెందుల రూరల్ : మండలంలోని మల్లికార్జునపురం గ్రామానికి చెందిన ఫొటో గ్రాఫర్ శివకుమార్ కొద్దిరోజుల క్రితం ద్విచక్ర వాహనంలో వెళ్తూ అదుపు తప్పి గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో 1992–93 టెన్త్ క్లాస్ చదివిన స్నేహితులు అతన్ని ఆదివారం పరామర్శించి చికిత్స కోసం రూ.11 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

విధుల్లో ఇబ్బందిపెడుతున్నారు

ముద్దనూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న ముస్కిన్ తనను విధుల్లో ఇబ్బందికి గురిచేస్తున్నారని ఆశ వర్కర్ వై.సుబ్బలక్ష్మి ఆదివారం పత్రికా ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తనకు సంబంధం లేని పనులను చేయిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని స్థానిక వైద్యురాలికి విజ్ఞప్తి చేశానని తనకు న్యాయం చేయాలని ఆమె తెలిపారు.

ఎస్సీవర్గీకరణకు అడ్డు తగులుతున్న మాలలు

జమ్మలమడుగు : ఎస్సీ వర్గీకరణకు మాలలు అడ్డుతగులుతూనే ఉన్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాదిగలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం ప్రత్యేక చర్యలను తీసుకోవాలన్నారు. ఉపకులాల గణాంకాలను నిష్పక్షపాతంగా సేకరణ చేయాలన్నారు. దీంతో బోగస్ కులాలకు ఏకసభ్య కమిషన్ అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయమైన గ్రామీణ రోడ్లు



ఎర్రగుంట్ల : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. గులకరాళ్లు బయట పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా హనుమనుగుత్తి–ఎర్రగుంట్లల మధ్య ఉన్న రోడ్డు గుంతలమయమైంది. ఈ రోడ్డులో నిత్యం ఇసుక ట్రాక్టర్లు తిరుగుతుండటంతో గుంతలు పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల వర్షాలు అధికంగా పడటంతో ఈ గుంతలు పెద్దవిగా మారాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నదీ స్నానాల్లో అప్రమత్తత అవసరం



పుష్పగిరి వద్ద పెన్నా నదిలో లోతు ఎక్కువగా వున్న ప్రాంతం

వల్లూరు : ఈనెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా కడప ఎన్‌జీవో కాలనీకి చెందిన గణేష్ అనే యువకుడు పుష్పగిరికి వచ్చి పెన్నా నది నీటిలో మునిగి మృతి చెందాడు. గతంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. ఇలాంటి సంఘటనల పట్ల అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

- ఎంతో శుభప్రదమైన కార్తిక మాసంలో నదీ స్నానాలకు ఎంతో ప్రాధాన్యత వుంది. ఈ మాసంలో శైవక్షేత్రాలను దర్శించుకోవడానికి భక్తులు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇందులో భాగంగా నదీ స్నానాలు చేసి, నదిలో దీపాలు వదలడం, సమీపంలోని దేవాలయాల్లో దీపాలు వెలిగించి దైవ దర్శనం చేసుకోవడం ముక్తికి మార్గాలుగా భావిస్తారు. అయితే వర్షాకాలమైనందున ఈ మాసంలో నదుల్లో సైతం నీటి ప్రవాహం అధికంగా వుండే అవకాశాలు వుంటాయి. దీంతో ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా ప్రమాదాల బారిన పడే అవకాశాలు పొంచి వుంటాయి. దీన్ని దృష్టిలో వుంచుకుని భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

పుష్పగిరి నదిలో జాగ్రత్త

పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి వద్ద పెన్నా నదిలో కొండకు సమీపంలో ఏర్పడే మడుగులు (సుడి గుండాలు) అత్యంత ప్రమాదకరం. గతంలో ఈ మడుగుల్లో పడి ఎంతో మంది ప్రాణాలను కోల్పోయిన సందర్భాలు అనేకం వున్నాయి. అయితే గత కొన్ని సంవత్సరాలుగా నదిలో నీటి ప్రవాహం తక్కువగా వుంటున్న నేపథ్యంలో ఈ మడుగులు క్రమంగా పూడి పోయాయి. అయితే ఈ ఏడాది పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నది ఉధృతంగా ప్రవహించింది. ఉధృత ప్రవాహం మూలంగా కొండ వైపు నీటి లోతు ఎక్కువగా వుంది. దీంతో ఈ సారి తిరిగి మడుగులు (సుడి గుండాలు) ఏర్పడి వుండే అవకాశాలు వున్నాయని అనుభవజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. గ్రామం వైపు కొద్దిగా లోతు తక్కువగా వున్నప్పటికీ కొన్ని చోట్ల ఎక్కువ లోతు వుండే అవకాశం వుందని పేర్కొంటున్నారు. కాబట్టి భక్తులు మరీ లోతు వున్న ప్రాంతాలకు వెళ్లకుండా నది చివరన లోతు తక్కువగా వున్న ప్రాంతాల్లోనే స్నానాలు చేసి దీపాలు వెలిగించుకోవాలని సూచిస్తున్నారు.

పోలీసులు చర్యలు చేపట్టాలి

కార్తిక సోమవారాలలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పుష్పగిరికి వేలాది మంది భక్తులు తరలి వస్తారు. వారికి నది పరిస్థితులు తెలిసే అవకాశాలు లేనందున, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది. ఈ రోజుల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చునని పలువురు కోరుతున్నారు. భక్తులు కూడా పిల్లలను స్నానాలకు దగ్గరుండి చేయించడం, లోతుకు దిగకుండా చూడడం, సెల్ఫీల మోజులో ప్రమాదాల బారిన పడకుండా వుండడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ మాసాన్ని పవిత్రంగా ముగించుకోవచ్చు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



కమలాపురంలో నిర్వహించిన ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కమలాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి బి ఎస్.నాగాంజలి తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

లింగాల : స్థానిక బీసీ వసతి గృహంలోని విద్యార్థులకు ఆదివారం లైబ్రరి ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం, బుక్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే గ్రంథాలయ పితామహులైన గాడిచర్ల పురుషోత్తంరావు, వెంకటరమణ, లాలాలజపతిరాయ్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



నీటిలో గంబూసియా చేపలను వదులుతున్న అధికారులు

పులివెందుల రూరల్ : అర్బన్ పరిధిలోని రోటరీపురం బ్రిడ్జి వద్ద దోమల నియంత్రణ కోసం గంబూసియా చేపపిల్లలను బాకరాపురం వైద్యాధికారి శాంత్‌కుమార్, సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేశారు. వర్షాకాలంలో దోమలు సహజంగా ఎక్కువగా ఉంటాయన్నారు. వీటివల్ల అనేక రోగాలు వచ్చేఅవకాశం ఉందన్నారు. మలేరియా, డెంగీ, విషజ్వరాలు వస్తుంటాయన్నారు. అధికారులు దోమల నియంత్రనకు చెరువులు, చిన్నచిన్న కుంటల్లో నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో గంబూసియా చేప పిల్లలను విడుదల చేస్తారన్నారు. ఈ చేపలు రోజుకు సుమారుగా 150కి పైగా దోమల లార్వాలను తినగలవన్నారు. దీంతో దోమలు పెద్దవి అవ్వక ముందే చనిపోతాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఉదయ్ కుమార్‌రాజు

వేంపల్లె : స్థానిక శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆ సేవా సమితి సభ్యులు కె.సాయినాథ్, పుల్లగూర గోవర్ధన్‌లు తెలిపారు. ఆదివారం స్థానిక కడప రోడ్డులోని షిరిడి సాయి బాబా ఆలయ ప్రాంగణంలో చర్మవ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పొద్దుటూరుకు చెందిన ప్రముఖ చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ ఉదయ్‌కుమార్‌రాజా 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పుష్పయాగం



పల్లకి సేవలో అయ్యప్ప భక్తులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని చిన్నరంగాపురం గ్రామ సమీపం కోతి సమాధి ఆలయ ప్రాంగణంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో కార్తికమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం అయ్యప్ప స్వామికి పుష్పయాగం నిర్వరిచారు. అయ్యప్పస్వామి మూలవిరాట్‌ను రకరకాల పుష్పాలతో ముగ్ధమోహన రూపంగా అలంకరించి సహస్ర నామావళితో పుష్పయాగాన్ని అయ్యప్ప భక్తులచే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప ఉత్సవమూర్తిని ప్రత్యేక పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ మంగళ వాయిద్యాల నడుమ ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప.. హరిహర పుత్ర అయ్యప్ప నామ జపాలతో పల్లకీ ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. అనంతరం పుష్పయాగం నిర్వహించి భక్తిశ్రద్ధలతో తాళాల భజనలతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం(బిక్ష) ప్రసాదంతోపాటు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ గురుస్వామి వెంకటరామిరెడ్డి, అయ్యప్ప భక్తులు, ఆలయ అర్చకులు పూజాది కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సమస్యలను పరిష్కరించండి



సమస్యను ఎమ్మెల్యేకు తెలుపుతున్న గ్రామస్తులు

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల కార్యాలయంలో ఆదివారం మండల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి పాల్గొని మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆయన వివిధ శాఖలకు చెందిన అధికారులను ఆదేశించారు. ఉపమండలాధ్యక్షుడు వెంకటసుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చెరువులకు గుర్రంగుంపు రిజర్వాయర్ నుంచి నీటిని కేటాయించి గుర్రంగుంపు సుగాలితండా, వేపమానుసత్రం గ్రామాలకు నీటిఎద్దడి లేకుండా చూడాలన్నారు. లింగారెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదుల నిర్మాణానికి స్థల సమస్య పరిష్కరించాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పాపసాహెబ్‌పేట సర్పంచ్ సురేంద్రరెడ్డి తమ పంచాయతీ పరిధిలోని రోడ్ల సమస్యలను, పంటల ఇన్సూరెన్సు సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే మూలవంక గ్రామస్తులు తమ గ్రామ శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలన్నారు. పూర్వం నుండి ఊటుకూరు గ్రామ పొలం సర్వే నెంబరు 689/1లో విస్తీర్ణం 60 సెంట్లు శ్మశాన వాటికగా 70 సంవత్సరాల నుండి ఉపయోగిస్తున్నామన్నారు. ఓ వ్యక్తి అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో అతని పేరును నమోదు చేయించుకున్నాడన్నారు. జేసీబీతో సమాధులను పడగొట్టిస్తున్నాడన్నారు. శ్మశాన వాటికను కాపాడాలని వారు కోరారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో కుల్లాయి బాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ శివరామిరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ చాంద్‌బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సీఐ శివశంకర్ నాయక్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు సిద్ధలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండలంలోని కనంపల్లె నామాలుగుండు వద్ద వెలసిన సిద్ధ లింగేశ్వరుడికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కార్తిక సోమవారంలో భాగంగా 3వ వారం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వస్తుండటంతో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ల తనిఖీ



టి.కోడూరులో పికెట్ రికార్డు తనిఖీ చేస్తున్న డిఎస్పీ కె.వెంకటేశ్వరరావు

కొండాపురం : మండలంలోని కొండాపురం, తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా జమ్మలమడుగు డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు ఆదివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ల రికార్డుల నిర్వహణపై సమీక్షించారు. అనంతరం ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్‌ఐలకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామంను ఆయన సందర్శించారు. గతంలో జరిగిన గొడవలకు గలకారణాలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు విద్యాసాగర్, హృషికేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ జెన్‌కో విజిలెన్స్ సీఐగా నారాయణయాదవ్



ఎర్రగుంట్ల : ఏపీ జెన్‌కో ఆర్టీపీపీ విజిలెన్స్ సీఐగా నారాయణయాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న విజిలెన్స్ సీఐ జావిద్ బదిలీపై కడప ట్రాఫిక్ సీఐగా వెళ్లారు. సీఐ నారాయణయాదవ్ గతంలో ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు త్రీటౌన్, కడప రెడ్ శాండిల్‌లలో సీఐగా పనిచేశారు.

అచ్చవెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మ తల్లిగా అచ్చవెల్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధిగాంచింది. అమ్మవారిని దర్శించుకునేందుకు కడప జిల్లా నుంచే కాక అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయ అర్చకులు కూడా అమ్మవారి పేరు మీద అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేస్తారు.

ప్రమాదంతోనే స్పందిస్తారా?

జమ్మలమడుగు : పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఒక వైపు వంగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో అవి ఎప్పుడు నేల కూలితాయో తెలియక స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విద్యుత్ స్తంభాలు మున్సిపాలిటీ కార్యాలయం సమీపం నుంచి బైపాస్ రోడ్డు వరకు హైటెన్షన్ విద్యుత్ తీగలతో పాటు 11 కేవీ విద్యుత్ తీగలు స్తంభాలున్నాయి. దాదాపు ఐదు నుంచి ఆరు విద్యుత్ స్తంభాలు ఒకవైపుకు ఒరిగిపోవడంతో భవిష్యత్తులో వర్షాలు పడితే మరింతగా వాలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు. ప్రమాదంతోనే స్పందిస్తారా? అని వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు.



ఒక వైపు ఒరిగిన విద్యుత్ స్తంభాలు

‘గండి అక్రమాలపై ఫిర్యాదు చేస్తా’

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే అక్రమాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి తోపాటు దేవదాయశాఖ మంత్రి, కమిషనర్, జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తున్నట్లు చక్రాయపేట జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన చక్రాయపేటలో విలేకరులతో మాట్లాడుతూ గండిలో నిబంధనలకు విరుద్ధంగా కొబ్బరి కాయలు, పూల దండల విక్రయాలు సాగు తున్నాయన్నారు. కొబ్బరికాయ రూ.35కు విక్రయించాల్సి ఉండగా రూ.50 నుంచి రూ.60కి అమ్ముతున్నారని మండిపడ్డారు. పూల దండలు రూ.120కి అమ్మాల్సి ఉండగా రూ.150కి అమ్ముతున్నారని తెలిపారు. అధికరేట్లకు అమ్ముతూ భక్తుల జేబులకు గండి కొడుతున్నారన్నారు. ఈ విషయం ఆలయ అధికారికి తెలిసినా పట్టించుకోలేదన్నారు. స్వామి వారికి నైవేద్యం కోసం తయారు చేసే పొంగళ్లు, పులిహోర కూడా తగిన మోతాదులో వేయక కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నైవేద్య ప్రసాదాలు కూడా నాసిరకంగానే ఉంటున్నాయన్నారు. ఆలయ నిర్మాణాల పనులు కూడా ఆగి పోయాయన్నారు. గండికి అధికారులు వస్తారు పూజారులు వేసే శాలువాలు కప్పించుకుని పూలదండలు మెడలో వేయించుకు వెళతారే గాని గండిలో ఏమి జరుగుతోందని ఎవ్వరూ ప్రశ్నించక పోవడం బాధాకరమన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, అబ్బిరెడ్డి వీరారెడ్డి దంపతులు



చండీ హోమంలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథరెడ్డి

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ దత్తాత్రేయస్వామి, గ్రామ దేవత గంగమ్మ ఆలయాల్లో జరుగుతున్న విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం దేవతా మూర్తుల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్ఆర్‌టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మాజీ జెడ్పీటీసీ, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి దంపతులు పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ప్రతిష్టా మహోత్సవాల్లో వేద పండితులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో ఉదయం వేద పండిత బృందం పూజలను నిర్వహించారు. జలాధివాసంలో వున్న శ్రీ గంగమ్మతల్లి, శ్రీ దత్తాత్రేయస్వామి, గణపతి విగ్రహాలతోపాటు ఉత్సవ మూర్తులకు పూజలను నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్‌లో కొలువు దీర్చి మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రజలు పసుపుతో కూడిన నీటిని వారపోస్తూ తమ ఇళ్ల వద్దకు దేవతా మూర్తులను ఆహ్వానించి కాయ కర్పూరాలు సమర్పించారు. అనంతరం యాగశాలలో ప్రధాన కళశ స్థాపన చేశారు. నవ గ్రహ ఆరాధన అనంతరం మహా గణపతి, ఆవాహిత దేవతా, నవగ్రహ, ప్రధాన మూర్తి హోమాలను నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నడుమ చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. యంత్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం మహాస్నపనము కార్యక్రమాన్ని నిర్వహించి దేవతా మూర్తులకు పాలు, పెరుగు, తేనె, ఇతర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం గణపతి, శ్రీదత్తాత్రేయస్వామి, శ్రీ గంగమ్మతల్లి విగ్రహాలతోపాటు వారి వాహనాలు, ఉత్సవ విగ్రహాలకు శయ్యాధివాసం నిర్వహించారు. అలాగే విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఛండీ హోమంలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ మల్లేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటరెడ్డి, సిద్దారెడ్డి, సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, మాజీ జెడ్పీటీసీ వెంకటేసు, శివకుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

19 నుంచి ఆధార్ మొబైల్ కేంద్రాలు

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని 3వ, 4వ వార్డు సచివాలయాల్లో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు ఆధార్ మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 26 నుంచి 29వ తేదీ వరకు కోగటం, చిన్నచెప్పలి గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఈ కేంద్రాల్లో 0–5 సంవత్సరం పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయడంతో పాటు ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్, వేలి ముద్రలు అప్‌డేట్ చేయుట తదితర సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. విద్యార్థులతో పాటు అన్ని వయస్సుల వారు ఈ ఆధార్ మొబైల్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

ముద్దనూరు : ఈనెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు స్థానిక రెండు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ముకుందరెడ్డి తెలిపారు. ఈ కేంద్రాలలో 0 నుండి 5 సంవత్సరాల వయసు వారికి ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయడం, ఆధార్ కార్డు నందు చిరునామా, ఫొటో మార్పిడి, ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింక్ చేయడం, వేలి ముద్రలు అప్‌డేట్ చేయడం వంటి సేవలు అందుతాయని ఎంపీడీవో తెలిపారు. ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

నిబంధనలు పాటించని మద్యం దుకాణాలు



వేంపల్లెలో ఉదయం 8 గంటలకే తెరుచుకున్న మద్యం షాపు

వేంపల్లె : పట్టణంలో మద్యం దుకాణ యజమానులు నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఐదు మద్యం దుకాణాలకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలవగా.. ప్రైవేట్ వ్యక్తులు వాటిని దక్కించుకుని ఏర్పాటు చేసుకున్నారు. అందులో ఒక మద్యం దుకాణం షాపు వైఎస్సార్‌సీపీ చెందిన వారు దక్కించుకోగా.. మిగిలిన నాలుగు షాపులు టీడీపీకి చెందిన వ్యక్తులు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే టీడీపీకి చెందిన నాలుగు మద్యం దుకాణాలను అధికార దర్పంతో ఉదయం 8 గంటలకే తెరుస్తున్నారు. అక్రమ మార్గంలో మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తూ ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం షాపులను నడుపుతుండేది. అది కూడా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటలవరకు మాత్రమే ఉండేదని ఇప్పుడు మాత్రం ఎనీ టైం మందు దొరుకుతోందని పలువురు మహిళలు చెబుతున్నారు. కష్టం చేసిన డబ్బులన్నీ మందుకే దారపోస్తున్నారని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా రహదారి



అధ్వానంగా ఉన్న కొత్తపల్లె గ్రామ రహదారి

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి వెళ్లే దారి అధ్వానంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు గుంతలు గుంతలుగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా గుంతలమయమై ఉండటంతోపాటు నీళ్లతో నిండిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.